# పద్మాసనం

బ్రహ్మాండమయిన పార్టీ జరుగుతోంది నగరంలోకెల్లా పెద్దయిన హోటలు విద్యా సాంస్కృతిక వ్యవహారాల మంత్రి గారు రచయితలకు ఇస్తున్న విందు. వార్షిక సమావేశాలకు అంగంగా ఇలాంటి పార్టీలు జరగడం ఈ రోజులలో అలవాటు అయి పోయింది.

అంతులేని ఆర్భాటం.

తెలియని వాళ్లందరితో పరిచయం.

పరిచయంలేని వాళ్ళందరితోనూ మాట్లాడడం మాట్లాడిన వాళ్ళందరినీ మనసులో బేరీజు వేసుకోవడానికి ప్రయత్నించడం.

వెయిటర్లు బేరర్లు ఒకటే హడావిడిగా తిరుగుతున్నారు. జనం గుంపులు గుంపులుగా చేరి ఏమిటేమిటో మాట్లాడుకుంటున్నారు.

పార్టీ పూర్తిగా "బఫ్" కాదు, పూర్తిగా "టేబుల్ సర్వీస్" కాదు.

రచనలు చేయడమే వృత్తిగా వున్న వాళ్ళందరిలో రావడమే ప్రవృత్తిగా కల వాళ్ళను కన్నులవిందుగా చూడడానికి మంచి అవకాశం.

మనసులో దిగులు ముఖంమీద కనిపించకుండా తీవ్ర ప్రయత్నం చేస్తూ ఒకపక్క మసులుతున్న నన్ను చూచి అల్లంత దూరం నుంచి "ఓహ్" అంటూ హర్షధ్వానం చేసి చేయి పైకెత్తి "నీ దగ్గరకు వస్తున్నాను. కాచుకో.." అన్నట్లుగా సైగచేస్తూ జరజర ముందుకు వచ్చేస్తోంది ఒకావిడ.

"ఎవరామె?" అని ఎవరయినా అడిగి తెలుసుకునేందేకయినా అవకాశం ఇవ్వకుండా ఆమె నా ముందుకు వచ్చి నిలబడింది.

బాగా పరిచయం, తెలివి ఉన్న ముఖం మాదిరే ఉంది. కాని గుర్తు రావడం లేదు. బుర్ర గోక్కున్నాను అక్కడికి అయినా ఎలాంటి సమాధానమూ ముందుకు రాలేదు. ఈ మట్టిబుర్రలోనుంచి యుక్తిగా మాట్లాడి పెద్దమనిషి తరహాకు ఎలాంటి లోపం రానివ్వకుండా ఆమె ఎవరో ఆమె నుంచే రాబట్టుకోవాలి. అంతకంటే అవకాశం లేదు.

"ఎలా ఉన్నాడు?" అంటూ చేయి ముందుకు చాచింది. రెండో చేత్తో భుజం మీద మృదువుగా తట్టింది. ఆత్మీయత ఒలకబోయడంలో ఇదో పద్ధతి అని నాకు బాగా తెలుసును.

"భేషుగ్గా ఉన్నాను.. మీరు.. ఎలా ఉన్నారు?" అని ప్రతి ప్రశ్న వేశాను.

ఇప్పటికీ గుర్తు రావడం లేదు. ఆమె ఎవరో.

దగ్గర దగ్గర నలభై ఏళ్ళు ఉంటాయి, ఏమో - ఏం చెప్పగలం? ఈ రోజులలో "మేకప్" పదార్థాల మహాత్మ్యం వల్ల వయస్సు అంచనా వేయగలగడం అసాధ్యం అయిపోతుంది అందులోనూ షోకు చేసుకున్న ఆడవాళ్ళనా?

తెల్లటి సిల్క్ చీర. చక్కటి బార్డర్.

జుట్టు చక్కగా దువ్వి, నగిషీగా 'బన్' చుట్టి అందమైన ఫుట్‌బాల్‌లా తయారుచేసింది మెడమీదికి.

హెయిర్ స్టయిల్ మార్చి పారేస్తూ ఉంటారు. ఈ ఆడవాళ్ళు అందుచేతనే వాళ్లను కనుక్కోవడం గుర్తుపెట్టుకోవడం కష్టం అయిపోతుంది.

వెనక మేం కలసుకున్నప్పుడు ఈమె బహుశ - చక్కటి పొడిగాటి వాలుజడ వేసుకుని వేదాంతం సత్యనారాయణ వేసే 'సత్యభామ' వేషంలాగా ఉండేదేమో - ఎలా చెప్పగలగడం?

మొత్తంమీద ఆమె వాలకం నాకు చదరపుబొమ్మ లాంటి మహారాణిని గుర్తు తెస్తోంది. చదరంగం 'సెట్'లో రాణిలా ఠీవిగా - హుషారుగా...

ఒకమారు కనిపించినట్లు మరోమారు కనిపించదు. ఈ ఆడవాళ్ళు అందులోనూ కొన్ని సంవత్సరాల విరామం ఉంటే ఇంకా చెప్పేది ఏముంది?

'చక్కగా ఉన్నాను' అంది ఆమె. పక్క నుంచి వెడుతున్న 'బేరర్' ట్రేలో నుంచి 'ద్రాక్షరసం' గ్లాసు తటాలున అందుకుంటూ

'కుటుంబం అంతా కులాసాగా వున్నారా?' అనడిగాను. ఈ సమాధానం లోనయినా ఏదయినా 'క్లూ' దొరుకుతుందా? అని.

'అందరూ కులాసా.. భేషుగ్గా ఉన్నారు. ఆ!.. లీల ఎలా ఉన్నారు?'

'ఓహ్! అయితే ఈమెకు మా ఆవిడ కూడా తెలుసునన్నమాట. నిజంగా తెలుసుకోలేక పేరు మట్టుకే జ్ఞాపకం పెట్టుకుని సందర్భోచితంగా చిలుకపలుకు పలుకుతోందో? ఎలా చెప్పగలగడం దినపత్రికలలో కనబడే క్రాస్‌వర్డ్ పజిల్‌కంటే కష్టమయిన చిక్కు ప్రశ్న.

"ఈ మధ్య ఎప్పుడయినా ఢిల్లీ వచ్చారా? సాహసం చేసి అడిగాను ఆమె ఉండేది ఢిల్లీ అయితే నా పని కుదేలేగదా?

"మనం కలిసి భోజనం చేసిన తర్వాత ఒక్క మారు మాత్రం వచ్చాను.." అంటూ ఆమె ముఖం ముడతపెట్టి నావంక చూస్తూ.

"ఏం, ఇప్పటికి నేను గుర్తు రాలేదులా ఉంది మీకు -" అంది.

నేను చిరు మందహాసం చేశాను.

"అంత అన్యాయంగా మాట్లాడకండి దమయంతి గారూ - మిమ్మల్ని మరిచిపోవడం ఎలా సాధ్యం నాకు? అన్నాను.

ఆమె ఆనందంగా తృప్తిగా నవ్వింది.

ఈ చదరంగం రాణి పేరు తటాలున సరీగా సమయానికి నా నాలుమీద ఆడింది. ఈ విచిత్రం ఎలా జరిగిందో. నా మర్యాద కాపాడడానికి ఏ దేవతలు యెలా కంకణం కట్టుకు కూర్చున్నారో నాకే ఆశ్చర్యం అనిపించింది.

ఆమెను గురించి ఇప్పటికీ లీలగానే గుర్తు అయినా ఆమెతో కలిసిచేసిన భోజనం మటుకు ఎప్పటికీ మరిచిపోను.

నా మొదటి నవల ప్రచురణ అయిన రోజులు

ఇంగ్లీషు, తెలుగు పత్రికలు.. అందరూ నవలను చక్కగా ఆదరించారు. కాకపోతే ప్రచురణకర్త దగ్గర్నుంచి అంత ఆదరణ మటుకు లభించలేదు - అనుకోండి.

'డబ్బు సంపాదన' లక్ష్యంగా పెట్టుకుంటే పుస్తకాలు రాయడం మంచి పనికాదు. అని నా స్నేహితులు. బంధువులూ కూడా ఒకటే రకంగా హెచ్చరిస్తూ వచ్చారు. కాని నాకు మాత్రం ఒకటే అనుమానం..

నాకు చేతనయిన విద్య 'వ్రాయడం' ఒక్కటే. పుస్తకాలు వ్రాయడం తప్ప యింకే చేతగాని వాడిని.. మరోరకంగా డబ్బు సంపాదించాలను కోవడం దురాలోచన, దుస్సాహసం కాదా?...

సరిగా ఆ రోజులలోనే ఈ దమయంతి గారు బొంబాయి నుంచి నాకు ఏకంగా ట్రంక్‌కాల్ చేసి నా పుస్తకాన్ని రకరకాలుగా ప్రశంసించారు, శ్లాఘించారు. రచయితకు ఇంతకంటే ఆనందదాయకం అయిన విషయం యింకేం ఉంటుంది? తన పుస్తకాన్ని గురించి బాగున్నదని చెప్పగా వినడం.. రచయిత మానసంలో కలిగించే ఆమోద ప్రమోదాల మధ్య ఉక్కిరిబిక్కిరి అయిపోయాను.

ఢిల్లీలో ఉన్న ఒక కాలేజీ అమ్మాయి - ఒకమారు ఆఫీసు నుంచి టెలిఫోన్ చేసి ఫలానా పేజి ఫలానా లైన్‌లో అచ్చుతప్పు- స్పెల్లింగ్ తప్పు పడింది, మీరు గమనించారా? ఇంకేమయినా దృష్టికి వస్తే మీకు వెంటనే ఫోన్ చేసి చెబుతాను. జాగ్రత్తగా నోట్ చేసుకుని రెండవ ముద్రణలో సరిచేసుకోండి నాకు కృతజ్ఞతలు కూడా తెలపండి. పీఠికలో-" అంది ఒకమారు.

పుస్తకం రెండో ముద్రణ ఆకాశంలో వున్న ఒంటరి జాబిల్లితో ఆడుకోవడం లాంటిది కనుక - ఆ తప్పు ఒప్పుల పట్టిక సంగతి అంతగా పట్టించుకోలేదు.

ఆమె దమయంతిగారు - టెలిఫోన్ చేసినప్పుడే నాకు ఆకాశం యెక్కినంత ఉత్సాహం అయింది.

ఆ పేరు - అందునా ఆమె భర్తగారి పేరుతో జోడించి చూచినపుడు.... : ఆయన

'హిందీ సినిమా నిర్మాత. ఎన్నో అవార్డులు అందుకున్న మనిషి. సినిమా రంగంలో ఆయన పేరు సృష్టించని మాయలూ, మర్మాలూ లేవు.

'ఈ మారు నేను ఢిల్లీ వచ్చినప్పుడు.. మీరునాతో కలిసి భోజనం చేయాలి' అంది ఆమె.

'కాదు మీరే నాతో పాటు భోజనం చేయాలి' అన్నాను. సాంఘిక మర్యాద గుర్తుకు తెచ్చుకుని.

'అలాగే తప్పకుండా ఢిల్లీ రావడం తోటే మీకు ఫోన్ చేస్తాను-' అంది ఆమె.

అలాగే చేసింది కూడా.

అదీ ఆరునెలల తర్వాత. అప్పుడు లీల ఊళ్ళో లేదు. ఆమెను ఎక్కువసేపు మాటాడనీయకుండా చప్పున అడిగేశాను. "భోజనానికి ఎక్కడ కలుసుకుందాం? మీకు నచ్చిన హోటల్ పేరు చెప్పండి". అని

ఢిల్లీలోని పెద్ద రెస్టారెంట్ పేరు చెప్పింది ఆమె ఒక్క క్షణమయినా తడుముకోకుండా.

నేనలా అడిగినందుకు, తొందరపాటుకు నన్ను నేను నిందించుకుందుకు - ఒక్క క్షణమయినా పట్టలేదు నిజానికి.

ఆ రెస్టారెంట్

మెట్లు ఎక్కడానికయినా నాకు స్తోమతు వుందా?

కాని ఇప్పుడు ఏం చేసేట్లు? సమయం మించిపోయింది.

'సోమవారం సరీగ్గా ఒంటిగంటకు సరాసరి అక్కడికే వస్తాను. టేబుల్ బుకింగ్ నాకు ఒదిలెయ్యండి. మీరు అశ్రమ పడలేరు' అంది ఆమె.

అవును అక్కడ - అనుకున్న సమయానికి టేబుల్ బుక్ చేయగల సామర్థ్యం నాకు లేదు.

ఆరోజు....

నాకున్న వాటిలో చక్కని దుస్తులు వేసుకున్నాను. మంచి సందర్భం కోసం దాచుకున్నట్టే.. షర్ట్.. అగ్నిపరీక్షో జల పరీక్షో.. ఇదేమిటో... మధ్యాహ్నాంకల్లా తేలిపోతుంది.

దారిలో బ్యాంక్‌కు వెళ్ళాను. నా ఎకౌంట్‌లో ఎంత బాలెన్స్ వుంది అని అడిగాను.

తొంభయి ఆరు రూపాయల నలభయి ఎనిమిది పైసలు..... అని జవాబు వచ్చింది.

తొంభయి అయిదు రూపాయలకు చెక్ వ్రాసి (ఆ మాత్రమయినా బాలెన్స్ లేకపోతే బ్యాంక్ మేనేజర్ ముఖం నల్లబరుచుకుంటాడు గనుక) సరాసరి హోటలుకు వెళ్ళాను. సరీగ్గా సమయానికి ఒక్క నిమిషం ముందుగా..

రెస్టారెంట్ నిండా వెయిటర్లు, కూర్చోడం తడవుగా లోతుకు తీసుకుపోయే మెత్తటి సోఫాలు ఈ రెంటినీ మనం తినం. కాని వాటికి అయ్యే ఖర్చు మనం చెల్లించే 'బిల్'లో ప్రధానాంశం.

హోటల్‌లో ఒక మూల సీట్.

ఇద్దరు కూర్చునేందుకు వీలయిన అందమయిన జాగా.

టేబుల్‌కు అప్పుడే ఒక పక్క అందమయిన యువతి - మరీ అంత పడుచు ఆమె కాకపోవచ్చును. కాని ఎంతో హుందా అయిన మనిషి. ఠీవిగా మహారాణిలా అగుపించే ప్రౌఢ - కూర్చొనివుంది.

ఆమె నా కోసం ఎదురుచూస్తున్న 'అతిథి' అని నా మనసు స్పష్టంగా చెబుతోంది. సరాసరి టేబుల్ దగ్గరకు వెళ్ళాను.

'ఓ జీవితకాలంగా నిన్ను ఎరుగుదును. మనం ఎంతో ఆత్మీయులం' అన్నట్లుగా ఆమె పలుకరించింది.

ఆమె ముందు ఒక 'డ్రింక్'గ్లాసు అప్పుడే ఖాళీ అవుతోంది.

నేను ప్రత్యేకించి 'అపటైజర్' కోసం ఆర్డర్ ఇవ్వలేదు భోజనం ముందు 'తాగడం' నాకు అలవాటు లేదు - అని క్షమాపణలు చెప్పుకున్నాను ముందుగానే.

ఆమె వెంటనే సినిమారంగం గురించి, దానిలో మంత్రవేత్తలుగా భావించే మహనీయుల పేర్లు - ఏ కరువు పెడుతూ మాట్లాడుకుంటూ పోతుంది.

నేను మెల్లిగా నా ముందు ఉన్న 'బిస్కెట్ తుంపులు' ఒక్కొక్కటి నోట్లో వేసుకుంటూ శ్రద్ధగా వింటున్నాను.

కొన్ని క్షణాలలో మా బల్ల దగ్గరకు వెయిటర్ సాక్షాత్కరించాడు. 'మెన్యూ' పుస్తకాలు... చక్కగా లెదర్ బైండింగ్ చేసినవి మాకు అందించాడు. ఆ అందమైన పుస్తకాల పుటలు విప్పి చూశాను. సుందరమైన అచ్చు. మిన్న అయిన బైండింగ్. నా 'నవల' బైండింగ్ కంటే లక్ష రెట్లు మెరుగయిన తీరు.

మొదటి 'అధ్యాయం' చదువుతున్నాను. పదార్థాలు.. వాటి ధరలు.. తల తిరుగుతున్నట్లు అనిపించింది. ఇక్కడికి నూరేనూరు గజాల దూరంలో ఉన్న సాదాసీదా రెస్టారెంట్‌లో ఇదే సరుకు - ఇందుకు నాలుగో వంతు ధరలో - సప్లయి అవుతుంది. బహుశ ఇక్కడికి కూడా ఆ 'సరుకే' తీసుకు వచ్చి 'సర్వ్' చేసినా ఆశ్చర్యం లేదు.

"మెన్యూ పుటలు చూస్తూ ఉంటే చక్కటి భోజనం చేసి ఎన్నాళ్ళు అయింది?... వాటిలో మరో రోజు చేరబోతుంది గదా అనిపిస్తుంది. 'నవల ఇతర భాషలకు అనువాదం చేసే హక్కు అమ్మడమో - లేక సినిమా తీసే హక్కు అమ్మడమో జరిగితే తప్ప ఇక్కడ భోజనం చేయడం కుదరదు. తుష్టిగా, సంతృప్తిగా.

'ఏం తీసుకుంటారు?' అని అడిగాను.. మర్యాద కోసం నాంది ప్రస్తావనగా.

'చాలా తేలికగా భోజనం చేస్తాను అంతే' అంది ఆమె

తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.

తేలిక భోజనం అంటే - ప్రతిసారి 'ఖర్చు తక్కువ భోజనం' అని అర్థం కాదు.

ఆమె వెయిటర్ వంక తిరిగి - చిరునవ్వుతో - ఆర్డర్ ఇచ్చింది. వెయిటర్ అమితశ్రద్ధతో ఆమె మాటలు ఆలకించాడు. భక్తిగా 'నోట్' చేసుకున్నాడు తన ప్యాడ్‌లో.

నా కళ్ళు ఎంతసేపూ ఆమె చెబుతున్న పేర్లకు ఎదురుగా ఉన్న ధరల వివరం వంక చురుకుగా పనిచేస్తూ చూస్తున్నాయి.

బహు తేలికగా నాకు కావలసినవి ఒకటి. రెండు ఐటమ్స్ చెప్పి ఊరుకున్నాను. నా 'సరళం'కు వెయిటర్ ఆశ్చర్యపడ్డట్లు కనిపించినా, మారు మాట్లాడకుండా మమ్మల్ని ప్రశాంతంగా వదిలి వెళ్ళాడు.

ఆమె మళ్ళీ సినిమా కథలను గురించి, నవలల్లో కథలను గురించి మాట్లాడసాగింది. ఇప్పుడు ఏంరాస్తున్నారు? - అని ప్రశ్నించింది.

ఏదో కొత్త నవలకు ప్లాట్ ఊహించి - కాస్త కాస్త - బిట్స్‌గా, సూచనగా సన్నివేశాలు చెప్పాను.. ఆమె చాలా ఉత్సాహంగా వింటూంది. మెచ్చుకుంటూంది.. కాని మధ్యలో భర్తగారి పేరు మాట వరసకయినా తీసుకురావడం లేదు. భర్తకు నా నవలను 'పిక్చరయిజ్' చేయమని రికమెండ్ చేస్తానని అనడం లేదు. నా అంతట నేనే అడగటం నాలుక చివరిదాకా మాట వచ్చినా.. మర్యాద లక్షణం కాదని ముందు ముందు అనుబంధాలకు అంతరాయం అయిపోతుందని... నోరునొక్కుకుని ఊరుకున్నాను. డబ్బు కోసం ముఖం వాచిపోయి వున్నట్లు దేబిరిస్తున్నట్లు కనిపించడం ఎలా? 'రచన' తప్ప జీవితంలో ఇంకేమీ ఆసక్తి లేని వాడిలాగ అగుపించడం ఇలాంటి సన్నివేశాలలో ఎంతయినా ఉత్తమమయిన ప్రక్రియ.

మేం ఆర్డర్ చేసిన "డిషెస్" వచ్చాయి.

మెల్లగా ఆరగిస్తున్నాము.

సారాయం వెయిటర్ మా కోసం కొత్త మెన్యు కార్డులు తీసుకువచ్చాడు.

వెయిటర్లు మర్యాదగా అతి వినయంగా అడినవన్నీ అడిగినదే తడవుగా తెచ్చి అందిస్తున్నారు.

ఆమె మరో రెండు "సారాయం" గ్లాసులు ఆర్డర్ చేసి అంది పుచ్చుకుంది.

నేను మాత్రం మొదట చెప్పిన "డిషెస్"తోనే సంతృప్తిపడి ఊరుకున్నాను.

"ఇంకేమయినా యిమ్మంటారా?"అనడిగాడు వెయిటర్ చివరిసారిగా.

నేను గాఢంగా గాలి పీల్చుకున్నాను.

"ఐస్‌డ్ కాఫీ" అంది ఆమె.

"సార్ యేం పుచ్చుకుంటారు?"

"యేం వొద్దు" అన్నాను. వెయిటర్ నన్ను వదిలాడు అంతటితో. నాకు కాఫీ ఎందుకు అక్కర్లేదో కారణం ఊహించలేకపోయినాను.

ఆమె తన 'వ్యానిటీబ్యాగ్ నించి నా నవల ఒక ప్రతి బయటకు తీసింది.

"ఇన్నర్ టైటిల్" పేజీ తీసి నాముందు వుంచింది.

బ్యాగ్ నుంచి తన బంగారు టిప్ ఫౌంటెన్ పెన్ తీసి తెరిచి నా చేతిలో ఉంచింది.

గర్వంగా పుస్తకం, పెన్ అందుకున్నాను.

హెడ్ వెయిటర్, ఇతర వ్యక్తులు ఎంతమంది ఎక్కువ చూస్తే అంత మంచిది అనుకున్నాను. సంతోషాతిశయంతో మనసంతా నిండిపోయింది. 'మరుపురాని సన్నివేశానికి చిహ్నంగా'- అని వ్రాసి సంతకం చేశాను చివరను.

ఆమె నేను వ్రాసిన మాటలు చూచి సంబరపడిపోయింది.

ఆమె కాఫీ తాగుతూ ఉండగా నేను వెయిటర్ను 'బిల్' తీసుకురమ్మన్నాను.

మనసులో గుణించుకుంటున్నాను. ఎంత మొత్తం అవుతుంది అని నా దగ్గరున్న పైకానికి సరిపడుతుందా లేక ... మర్యాద దక్కదా.. ఎలా...

పచ్చని 'సూట్' ధరించిన గంభీరమయిన వ్యక్తి వెండిట్రేలో బిల్ కాగితం మడిచి ముఖమల్ పర్స్‌లో ఇమిడ్చి తీసుకు వచ్చి నా ముందు వుంచాడు.

కాగితం అందుకుని చివరి అంకె చూదాను.

తొంభయి మూడు రూపాయల నలభయి అయిదు పైసలు...

"అమ్మయ్య" అని లోలోపలే ప్రగాఢంగా నిట్టూర్పు విడుస్తూ కోటు జేబులో నుంచి తొంభయి అయిదు రూపాయల బొత్తి యివతలకు తీసి ముఖమల్ పర్సులో వేశాను గుట్టుచప్పుడుకాకుండా.

కొన్ని క్షణాలలోనే 'గ్రీన్‌సూట్' ఆసామీ చిల్లరితో సహా వెండి ట్రే నా ముందుకు తెచ్చాడు. గబాలున రూపాయి చిల్లరా గుప్పిట్లో అందుకుని కోటు జేబులో 'స్థాపితం' చేసుకున్నాను.

నా ప్రవర్తన అతనికి కాస్త 'అక్కసం' గానే ఉంటుంది కాని - నేను - ఇక్కడ మంచి ఇంటికి అంతదూరము - నడుచుకుంటూ పోలేను గదా? ఆ క్షణంలో వెయిటర్ ముఖంలో కనపడిన చూపు ఎవరయినా 'సినిమా' ప్రొడ్యూసర్ చూచినట్లయితే అతడిని తన 'తరువాత' పిక్చర్‌లో 'కారెక్టర్ యాక్టర్'గా బుక్ చేసుకునేందుకు సిద్ధపడతాడు అనిపించింది నాకు.

ఆమె లేచింది హాల్లోంచి బయటకు నడుస్తోంది మధ్య మధ్య బల్లల దగ్గరివాళ్లు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఆమె ఒకటి - అరక్షణం ఆగి వాళ్లను పలుకరిస్తోంది.

ఆమె గేట్ దగ్గరకు వచ్చి 'లగేజ్ రేక్'లో తగిలించి వుంచిన మింక్ కోట్ కోసం ఆగింది. కోట్ తిరిగి ధరించడంలో ఆమెకు కాస్త సహాయపడ్డాను. థ్యాంక్స్ చెప్పించుకున్నాను.

రోడ్ మీదకు వచ్చాం.

పేవ్‌మెంటు మీద నిలిచి వుండగానే ఒక చక్కటి నీలం రోల్సు రాయిస్ కారు వచ్చి మా పక్కన నిలబడింది.

చాఫియర్ దిగివచ్చి ఆమెకు సలాంచేసి తలుపు తెరిచాడు.

గుడ్‌లక్ - అని. కాస్త సాహసం కూడగట్టుకుని అన్నాను. ఈ మారు వచ్చినప్పుడు మీ వారిని కలుసుకునే అవకాశం కూడా లభిస్తుందని ఆశిస్తున్నాను... వారికి నా శుభాకాంక్షలు అందజేయండి - యీ లోపల..."

"ఓ... మీకు తెలీదా?" అంది ఆమె రోల్స్‌రాయిస్ లోంచి యివతలకు చూస్తూ.

"యేమిటి?"

"మేం విడాకులు పొంది చాలా రోజులయింది-"

"విడాకులా?"

'అవును అతన్ని కలుసుకుని, మాట్లాడి చాలా రోజులయిపోయింది' అంది.

నేను నిస్సహాయంగా శరీరంలోని రక్తమంతా జడ్డుకుపోయినవాడిలాగ అలాగే పేవ్‌మెంట్ మీద నిలుచున్నాను. నేలమీద 'పద్మాసనం' వేసుకు కూలబడాలనిపించింది.

ఓహో! నాగురించి అంత మరీ చింతించకండి. అతన్ని వదిలేసినా నాపనేం నీరసంగా లేదు. ఈమధ్యనే మళ్ళీ వివాహం చేసుకున్నాను.

బహుశా మరో ఫిలిం ప్రొడ్యూసర్ పేరు వింటాననుకున్నాను. కనీసం అలా జరగాలని దేవుళ్ళను ప్రార్థించాను.

'చూచారూ' భోజనం చేస్తున్నంతసేప మా వారు ఎక్కడయినా ఎదురవుతారేమోనని ఒకటే కళవెళ పడిపోయాను. నిజం చెప్పొద్దూ.. ఈ రెస్టారెంట్ ఆయనదే సుమా!" అంది దమయంతి.

మరోమాట లేకుండా డోర్ మూసుకుపోయింది.

రోల్స్ రాయిన్ కారు ముందుకు దూసుకుపోయింది.

నేను దగ్గరి బస్‌స్టాప్‌కు నడక సాగించాను.

====

రచయితల మధ్య నిలబడి. చేతికి దొరికిన 'కప్'లు అందుకుంటూ మెల్లమెల్లగా తింటూ.. ఈ చదరంగం రాణి ముందు - ఫుట్‌బాల్ ప్రమాణంలో తయారుచేసిన తలకట్టు దమయంతి ముందు నిలబడి ఉన్నాను.

ఆమె రోల్స్‌రాయిస్ కారులో నా దగ్గర సెలవు తీసుకుని - నాకు సెలవు ఇచ్చి - అరోజు హోటల్ ముందు నుంచి దూసుకు ముందుకు పోవడం... అదృశ్యం యిప్పుడూ నా కళ్ళలో మెదలుతోంది. ఆమె మాటలు నెమరువేసుకుందుకు ప్రయత్నిస్తున్నాను.

నిజమే. నన్ను మరచిపోయారని యెలా అనుకుంటాను? ఏమయినా ఆ రోజు మిమ్మల్ని భోజనానికి తీసుకుపోయాను అంటూంది ఆమె.

*ఆంధ్రజ్యోతి-ఆదివారం, అక్టోబర్-1983*

◆